
# మంత్రసాని

సి.యస్.రావు



ఆ రోజు ఆదివారం !

నేనూ మా ఆవిడా కలిసిసావకాశంగా భోజనం చేస్తున్నాం ! ఒక్క ఆదివారం మధ్యాహ్నం తప్ప యిద్దరం కల్సి యింత సావకాశంగా భోంచేయడానికి వీలుపడదు – నా ఉద్యోగం అలాంటిది – నా వ్యాపకాలు అలాంటివి – ఇద్దరం ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ మా ఆవిడ కొసరి, కొసరి వడ్డిస్తుంటే తాపీగా తింటున్నాను.

పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాం ! మా ఆవిడ అడిగిన ఏదో ప్రశ్నకు నోటిలో ముద్దవుండగానే సమాధానం చెప్పబోయాను – ఉన్నట్టుండి పొలమారింది. నోటిలో పెట్టుకోబోయే ముద్ద కంచంలోనే వొదిలేసి, పక్కనేవున్న మంచినీళ్ల గాసులోని పురిషెడు తీసుకుని నా నెత్తినే చల్లింది మా ఆవిడ!

"ఏ వూళ్ళో పుట్టారు" అని అడింది.

"పాలెంలో" అని చెప్పగలిగాను కష్టంమీద గొంతు సవరించుకుంటూ.

"బొడ్డు కోసిన మంత్రసాని పేరు ?"

"...." నాకు సమాధానం దొరకలేదు. నిజానికి నేను పుట్టినపుడు, మా అమ్మకు పురుడు పోసిన మంత్రసాని ఎవరో....? దాని పేరేమిటో నాకు తెలియదు ! తెల్సుకోవలసిన అవసరం కూడా కలగలేదు.

కాని "బొడ్డు కోసిన మంత్రసాని ఎవరు" అని మా ఆవిడ అడిగిన ప్రశ్న నాలో చాలా ఆలోచనలను రేకెత్తించింది.... నెమ్మదిగా భోంచేస్తూనే, ఆలోచిస్తున్నాను.... పొలమారడానికీ నెత్తిమీద నీరుజల్లి, మంత్రసాని పేరు అడగటానికీ ఎటువంటి సంబంధమో, ఎంత ఆలోచించినా, నా కర్థంకాదు. చివరకు అది తెలుగు సాంప్రదాయం అని నాకు నేనే సర్ది చెప్పుకున్నాను.... కొన్ని సాంప్రదాయాలు మూఢ నమ్మకాలుగా కనిపించినా వాటికి ఓ అర్థముంటుంది.... అని అప్పుడప్పుడు మా నాన్నగారు అనే మాట జ్ఞాపకం వచ్చింది.

అన్నిటినీ మించి ఎప్పుడో చిన్నప్పుడు, నా కిలాగే పొలమారితే, మా అమ్మ యిలాగే నెత్తిమీద నీళ్ళు జల్లి యీ ప్రశ్నలే అడిగింది. దాదాపు ముప్ఫయ్యేళ్ల తర్వాత యిప్పుడు పొలమారితే మా ఆవిడా అవేప్రశ్నలడిగింది– ఈ రెంటినీ సమన్వయించుకున్న నాకు సాంప్రదాయం ఆడదాని ఒడిలో, నవ్వుతూ పసిపాపలా ఆడుకునేది అనిపించింది.... ఎందుకంటే చిన్నతనంలో అమ్మ జేజికీ, దేవుడికీ దణ్ణం పెట్టమంటుంది– అమ్మ మాట విని అలా దణ్ణంపెడుతూ నమ్మకాన్ని పెంచుకుంటాడు మనిషి. వయసు పెరగటంతోపాటు, నమ్మకం పెరిగితే ఆస్తికుడు— "జేజికీ దేవుడుకీ ఎందుకు దణ్ణం పెట్టాలి" అని ప్రశ్నించుకోవటం మొదలెట్టితే ఆ మనిషి హేతువాది. జేజి అంటే దీపం – ఆర్పేస్తే ఆరిపోతుంది వెలిగిస్తే వెలుగుతుంది. దేవుడంటే మనిషి భయానికి ప్రతిరూపం. ఆ భయాన్ని రాయిలో చెక్కిన ఆకారం అని ఒక నిర్ణయానికి వచ్చేస్తే ఆ మనిషి నాస్తికుడు.

— అలా అస్తవ్యస్తమయిన ఆలోచనలు మనసును గందరగోళం

చేశాయి .... భోంచేసి చెయ్యి కడుక్కున్నాను. మంచంమీద నడుం వాల్చాను — ఇంతకీ నా బొడ్డుకోసిన మంత్రసాని ఎవరో....? అనుకున్నాను- ఆస్తికత్వం, నాస్తికత్వం మించి చాలా మంది మేధావులకు చర్చనీయాంశము కాని మామూలు మంత్రసాని వైపు మనసు మళ్ళింది.

వారం రోజులు తిరక్కుండానే, నేను వుంటున్న నగరంనుంచి నేను పుట్టిన పల్లెటూరు పాలేనికి వెళ్ళాను.... ఏదో కాసేపు ఆ మాటా, యీ మాటా మాట్లాడుకున్న తర్వాత "నేను పుట్టినపుడు నీకు పురుడుపోసిన మంత్రసాని పేరేమిటమ్మా? ఎక్కడుంటుంది" అని అడిగాను - అటువంటి ప్రశ్న నా దగ్గిర్నుండి వస్తుందని అనుకోని అమ్మ, ముప్పైఏళ్ళ గతానికి వెళ్ళి, నవ్వుకుని "ఎరకల సత్తిరా" వూరు చివర పందుల గుడిశెల దగ్గర వుంటుంది. నువ్వు కడుపున పడగానే, నీకు మగ పిల్లాడే పుడతాడమ్మా అని ఎఱుక కూడా చెప్పింది" అంది మా అమ్మ.

ఆరోజు సాయంత్రం కొండంత కుతూహలంతో ఎఱుకల సత్తి గుడిశె వైపు వెళ్ళాను. దాని యింటి వేపు నడుస్తున్నంతసేపు మంత్రసాని గురించే ఆలోచన—

ఏ చూలాలికైనా నొప్పులు ప్రారంభం కాగానే మంత్రసానిఅవసరం పడుతుంది. అంతవరకు ఆ మనిషి ఎవరో, ఎక్కడుంటుందో తెలియకపోయినా వెతుక్కుంటూ వెడతారు - ఇంటికి తీసుకవస్తారు - పురిటి గదిలోకి ప్రవేశిస్తుంది. ఆ క్షణం నుంచి తల్లికాబోయే ఆడదాన్ని తల్లిలా ఆదుకుంటుంది... తల్లి వున్న ఆడదానికి, తల్లి లేని ఆడదానికి ఆ క్షణంలో మంత్రసానే తల్లి.... పుట్టబోయే బిడ్డ జన్మకు కారకుడైన భర్త ఆమె ప్రక్కన వుండడు....



ఒక్కొక్కసారి కన్నతల్లి కూడా ఆమె ప్రక్కన వుండదు.... నొప్పులు పడే చూలాలిని అటూ, ఇటూ నడిపించటం, పురిటి నొప్పుల బాధను మరిపించటానికి ఆ కబురూ, యీ కబురూ చెప్పటం, పురుడు ఆడదానికి మరో జన్మ అనిపించే స్థితిలో ఆమెకు ధైర్యం చెప్పటం, కన్నతల్లి కంటే మిన్నగా ఆ క్షణంలో ఆదుకోవటం మంత్రసాని బాధ్యత-బిడ్డను కని, అపస్మారక స్థితిలో తల్లి వుంటే పుట్టిన బిడ్డకు ఆ క్షణంలో స్పృహవున్న తల్లి మంత్రసాని- ఆ మాలిన్యంతో నిండిన పురిటి బిడ్డను దోసిళ్ళలోకి తీసుకుంటుంది-అసహ్యించుకోదు, బొడ్డు కోస్తుంది-తొలిసారిగా లాల పోస్తుంది.... తల్లి పక్కలో పడుకోబెడుతుంది. అలాంటి పాపలెందరో పెరిగి పెద్దవాళ్ళవుతారు .... అందులో కొందరు గొప్పవాళ్ళవుతారు. మామూలు మంత్రసానిని మామూలుగా మర్చిపోతారు.

"నేనూ అలాగే మర్చిపోయాను" అనుకుంటూ మంత్రసాని యిల్లు చేరుకున్నాను.

అప్పటికే ఓ పెద్దమనిషి, మంత్రసాని ఎఱుకల సత్తి గుడిసె తలుపులు బాదుతున్నాడు అది ఒక చిన్న గుడిశె- చుట్టూ మూడు, నాలుగు పందుల గుడిశెలు.... మరో రెండు ఎఱుకల వాళ్ళ గుడిశెలు. "సందకాడే నిద్దరోతున్నట్టుంది—ఎంత బాదినా ఉలకదు, పలకదు, తలుపు తియ్యదు"- అని మరి కాస్త గట్టిగా పిలుస్తూ తలుపు తట్టాడు ఆ పెద్దమనిషి. ఆ పిలుపుకీ, చప్పుడుకీ సత్తి గుడిశెతలుపు తెరుచుకోలేదు గానీ, పక్కగుడిశెలోంచి మరో మనిషి బయటికొచ్చి "తలుపు గొల్లెమెట్టి గాని ఎవరింటికేనా ఎల్లిందేమోనండి మరి" అన్నాడు.

"నేను గుడ్డోన్నేట్రా. తలుపు లోనకే ఏసుంది. ఎంత పిలిసినా తొంగుండి లెగుత్తుంలేదు" అన్నాడా మనిషి.

"అలాంటి మనిషి కాదండి- ఎంత రేత్తిరికాడ ఎవరొచ్చి పిలిసినా ఒక్క-




పిలుపుతో లేసేది" అంటూ ప్రక్క గుడిశెనుంచి సత్తి గుడిశె ముందు కొచ్చాడామనిషి. తనూ, తలుపు తట్టి పిలిచాడు, సత్తి తలుపు తెరుస్తుంది. బయటికొస్తే ఎలా వుంటుందో చూడొచ్చు అనే కుతూహలంతో నే నెదురు చూస్తున్నాను. ఎంత పిలిచినా తలుపు తియ్యడంలేదు.

ఆ వచ్చిన పెద్దమనిషికి, భార్య పురిటి నొప్పులతో పడుతున్న బాధ గుర్తుకొచ్చినట్టుంది— "సత్తి - సత్తి" అని రెండుసార్లు గట్టిగా పిలిచి, విసుగెత్తి బలంకొద్దీ కాలితో తన్నాడు– రెండో తన్నుకే లోపలి గొళ్లెం పట్టు తప్పి తలుపు తెరుచుకుంది. నులక మంచంలో వున్న సత్తిని చూసి మళ్లీ "సత్తీ" అని గట్టిగా పిలిచాడు.

సత్తి పలకలేదు.

పక్కగుడిశెలోంచి వచ్చిన ఎరకల వాడు "సత్తీ" అని పిలుస్తూ సత్తిని పట్టుకుని కదిపాడు.

"ఒల్లు చల్లబడిపోయింది– పోయినట్టుందండి" అన్నాడు– అంత వరకూ గుడిశెకు కాస్త ఎడంగా నిలబడ్డ నేను ఆత్రంగా గుడిశె గుమ్మందాకా వెళ్లి లోపలికి తొంగిచూస్తే మంచంలో పడున్న ఎరకల సత్తిని కళ్ళారా చూసాను.

నాకు బొడ్డు కోసినప్పుడు, బతికున్న ఎరకల సత్తే నా కళ్ల ముందే వున్నా, కళ్ళు తెరవని పసికందును కాబట్టి కళ్ళారా చూడలేకపోయాను –ఈనాడు కళ్ళారా చూడగల్గినపుడు ఎరకల సత్తి శవాన్ని చూడగలిగాను.

ఎరకల సత్తికోసం వచ్చిన పెద్ద మనిషి, సత్తి పోయిందని తెలియగానే, విసుగ్గా, ఏదో గొణుక్కుని నెప్పులు పడుతున్న అతని భార్యను, ఏంచేయాలో ఆలోచించుకుంటూ వెళ్ళిపోయాడు. ఎంతోమంది తల్లులకు పురుడు పోసింది ఎరకల సత్తి – ఎంతోమంది బిడ్డలకు బొడ్డులుకోసి, లాలలు పోసి పొత్తిళ్ళలో పడుకోబెట్టింది— అలా ఎందరి తల్లు లనో, ఎందరి బిడ్డలనో తల్లిలా ఆదుకున్న ఎరకల సత్తికి– చివరికి దిక్కులేని చావు.

దాని చావుకి ఏ తల్లీ అక్కడకు రాలేదు—

ఏ బిడ్డా అక్కడికి రాలేదు—

సాటివాళ్ళు, తోటివాళ్ళు, ఎంతో మందికి దిక్కైన సత్తికి, చివరికి దిక్కయ్యా ననుకుంటాను.

అది సృష్టి సహజం.

సమాజ న్యాయం.

———